రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 14: కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వినాయకా.. వీడ్కోలు ఇక..!

- నేడు నగరంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవం
- కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద ఏర్పాట్లు పూర్తి
- స్టాంటన్‌పురం కేసీ వద్ద, సంకల్‌బాగ్, తుంగభద్ర వద్ద కూడా..



ముస్తాబైన వినాయక ఘాట్

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 14: కర్నూలు నగరంలో తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలు అందుకున్న గణనాథుడు ఆదివారం గంగమ్మ ఒడిలోకి చేరుకోనున్నాడు. నగరంలో నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగుస్తుండగా, ఉత్సవ విగ్రహాలను నగర నడిబొడ్డున గల కేసీ కెనాల్ ఒడ్డున గల వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేస్తున్నారు. గత 44 ఏళ్లుగా ఈ నిమజ్జనోత్సవాన్ని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో, ఏటా నగర గణేశ్ మంటపాల నిర్వాహకులు వైభవంగా నిర్వహిస్తున్నారు. కాగా ఈ ఏడాది కూడా ఉత్సవాలను కన్నుల పండువగా చేసేలా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఎస్పీ జి. బిందుమాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వర్ కేసీ కెనాల్ ఘాట్ వద్ద పారిశుద్ధంతోపాటు వివిధ ఏర్పాట్లు చేశారు. చెత్త తొలగింపునకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. జిల్లాకు చెందిన రెవెన్యూ, విద్యుత్తు, నీటిపారుదల, మత్స్య, వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు కేసీ కెనాల్, వినాయక ఘాట్ వద్ద తగిన ఏర్పాట్లు చేశారు. వినాయక ఘాట్‌ను రంగురంగుల విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. కేనాల్‌కు అటూ ఇటూ విగ్రహాల నిమజ్జనానికి ఏడు ఘాట్లు సిద్ధం చేసి, 8 క్రేన్లు అందుబాటులో పెట్టారు. నగరంలో ప్రధాన రహదారుల వెంట తరలి వచ్చే భారీ విగ్రహాలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకొని, ట్రాఫిక్‌ను మళ్లించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పాతనగరంలోని శ్రీరాంబొట్ల ఆలయం నుంచి విగ్రహాల ఊరేగింపు మొదలవుతుంది. కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద మధ్యాహ్నం 2 గంటలకు నిమజ్జన వేడుకలను ప్రారంభిస్తున్నారు.

వినాయక ఘాట్ వద్ద విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లు పూర్తి

జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నిర్వహణలో కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద భారీ గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. విగ్రహాల నిమజ్జనానికి 8 క్రేన్లు నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేశారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కెనాల్ ఘాట్ వద్ద 7 ప్రాంతాలను సిద్ధం చేశారు. వినాయక ఘాట్ వద్ద మధ్యాహ్నం 12.30 గంటలకు సంస్కార భారతి ఆధ్వర్యంలో బాలబాలికలచే సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ బి. పార్థసారథి జ్యోతి ప్రజ్వలన చేసి నిమజ్జనాన్ని ప్రారంభిస్తారు. ఉత్సవాల ధ్వజారోహణ కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు చేస్తారు. భరతమాత చిత్రపటానికి పూజలను పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, నగర పాలక ఇన్‌చార్జి కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి చేస్తారు. సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ డి. చిరంజీవి, ఇరిగేషన్ ఎస్‌ఈ పి.రెడ్డి వేఖర్‌రెడ్డి, కర్నూలు ఆర్డీవో ఎం.శేషిరెడ్డి తదితరులు అందజేస్తారు. ఆధ్యాత్మిక సందేశాన్ని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘచాలక్ బి.నీలకంఠ తెలియజేస్తారు. గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ప్రారంభిస్తారు. గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పి.మోక్షేశ్వరుడు, జంపాల జనార్దన్, ఉమ్మడి జిల్లాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ ఎం. నాగఫణిశాస్త్రి ఈ కార్యక్రమాలకు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు.



వినాయక ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన క్రేన్

పాత నగరం నుంచి ఊరేగింపు ప్రారంభం

జిల్లా యంత్రాంగం, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీరాంబొట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహ మంటపం వద్ద పూజలు చేసి ఊరేగింపు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భాగ్యనగర్ గణేశ్ మహోత్సవ సమితి గౌరవాధ్యక్షుడు జి. రాఘవరెడ్డి పాల్గొంటున్నారు. ఊరేగింపు ప్రారంభకులుగా రాష్ట్ర భారీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్, నగర మేయర్ బీవై రామయ్య, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ జి. బిందుమాధవ్, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరై ఊరేగింపును ప్రారంభిస్తారు. పాతనగరంలోని వివిధ ప్రాంతాల నుంచి గణనాథుడి ఉత్సవ విగ్రహాలు పాతబస్టాండు మీదుగా కోట్ల సర్కిల్, కిడ్స్ వరల్డ్ రాజ్ విహార్, కలెక్టరేట్ మీదుగా కేసీ కెనాల్ వినాయక ఘాట్‌కు చేరుకుంటాయి.

నాలుగు ప్రాంతాల నుంచి విగ్రహాల ఊరేగింపు

నగరంలో మొదటగా ఉదయం 9 గంటలకు పాత నగరం నుంచి విగ్రహాల ఊరేగింపును ప్రారంభిస్తారు. ఈ ఊరేగింపు రాజ్‌విహార్ మీదుగా వినాయక్ ఘాట్ బయల్దేరుతుంది. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు బళ్లారి చౌరస్తా నుంచి విగ్రహాల ఊరేగింపు మొదలవుతుంది. ఇది మొదటి ఊరేగింపుతో రాజ్‌విహార్ వద్ద కలుసుకొని ఘాట్‌కు బయల్దేరుతుంది. మూడో ఊరేగింపు మధ్యాహ్నం 2 గంటలకు కల్లూరు చౌరస్తాలో మొదలై క్రిష్ణానగర్ మీదుగా బిర్లా సెంటర్ నుంచీ ఘాట్‌కు చేరుతుంది. నాలుగో ఊరేగింపు మధ్నాహ్నం 2 గంటలకు నంద్యాల చెక్‌పోస్టు నుంచి ప్రారంభమై బిర్లా సెంటర్ మీదుగా కేసీ కెనాల్ ఘాట్‌కు చేరుకుంటాయి.

నగరంలో గట్టి పోలీసు బందోబస్తు

గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విగ్రహాల వెళ్లే ఊరేగింపులను పోలీసులు పర్యవేక్షిస్తారు. వినాయక ఘాట్ వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా ఏర్పాట్లు చేశారు. గణేశ్ మండపాల నిర్వాహకులు ఊరేగింపులో పోలీసు వారికి సహకారం అందించాలని, ఎలాంటి సమస్యలు వచ్చినా ఉత్సవ కమిటీ ప్రతినిధులు, లేదా పోలీసు అధికారుల దృష్టికి తీసుకుపోవాలని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు సూచించారు.



కేసీ కెనాల్ వద్ద పోలీసులు

గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశాం

మంత్రి టీజీ భరత్

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 14: గణేశ్ నిమజ్జనాన్ని విజయవంతంగా, తేజోవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపు నుంచి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం గణేష్ నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా వినాయక ఘాట్ వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదు తర్వాత అంతే ప్రతిష్టాత్మకంగా కర్నూలు నగరంలో నిమజ్జనోత్సవం జరుగుతుందని అన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామ అన్నారు. ఘాట్ దగ్గర కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సంబంధిత కంట్రోల్ రూమ్‌లో అన్ని డిపార్టుమెంట్లు నోడల్ ఆఫీసర్లు, ఫైర్ డిపార్టుమెంటు, మత్స్యశాఖ, మెడికల్ శాఖల సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనానికి 1700 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు కంట్రోల్ రూమ్‌లో పోలీసు అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డీటీసీ ఆర్‌అండ్‌బీ అధికారులు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ ఉమాపతి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్



సెబ్‌కు బై.. అబ్కారీకి సై

- సర్కార్ మద్యం దుకాణాలు రద్దు..?
- సంబరాల్లో సెబ్ ఉద్యోగులు

సెబ్ విభాగం ఎక్సైజ్‌లో విలీనమైంది

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఎక్సైజ్‌లో వీలీనం చేసిన ప్రక్రియ పూర్తయింది. సిబ్బందికి విధుల కేటాయింపుల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన పాలసీలో ముందుకు వెళ్తుంది. ఈనెల 18న కొత్త మద్యం పాలసీకి సంబంధించి ఓ నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సమాచారం.

.- ఎం. సుధీర్ బాబు, సూపరింటెండెంట్, కర్నూలు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 14: ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగాన్ని రద్దు చేస్తూ జీవో జారీ చేసింది. ఉద్యోగులు, స్టేషన్స్‌ను ఎక్సైజ్ శాఖలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకుంది. జీవో వెలువడిన వెంటనే ఉద్యోగులు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కోల్లు రవీంద్ర బ్యానర్లకు క్షీరాభిషేకం చేస్తూ జేజేలు పలికారు. గతంలో ఎక్సైజ్ శాఖలో ఉన్న 70 శాతం ఉద్యోగులను విభజించి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాస్తంలోకి వెళితే ఎస్ఈబీ వచ్చిన తర్వాత గంజాయి, ఇతర రాష్ట్రాల మద్యం అక్రమ రవాణా, ఇసుక రవాణా అధికమయ్యాయి. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, గంజాయిలను అరికట్టడంలో ఆశాఖ వైఫల్యం చెందింది. కాగా జిల్లాలో ఉన్న 224 మంది ఎస్ఈబీ ఉద్యోగులు 12 జీవో రద్దుతో తిరిగి మాతృ శాఖకు వచ్చారు. వీరిలో ఈఎస్‌లు-2, ఏఈఎస్‌లు-2, సీఐలు-20, మంది ఎస్ఐలు-60, హెడ్ కానిస్టేబుల్స్-50, కానిస్టేబుళ్లు,-70, మినిస్టీరియల్-20 సిబ్బంది ఎక్సైజ్ శాఖకు బదిలీ అయ్యారు. కర్నూలు, నంద్యాల్లో ఉన్న ఎస్ఈబీ ఈఎస్ కార్యాలయాల్లో ఉన్న ఫర్నీచర్, కంప్యూటర్లు, ఎక్సైజ్ శాఖకు బదలాయించారు.

18నాటి కేబినెట్‌లో నూతన మద్యం పాలసీపై క్లారిటీ..

నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెల 18న జరిగే కేబినెట్ మీటింగ్‌లో విధి విధానాలపై ఓ నిర్ణయం వెలువడుతుందని ఎక్సైజ్ శాఖలో చర్చ జరుగుతోంది. మద్యం దుకాణాలకు టెండర్ విధానం అమలులోకి తేచ్చే యోచనలో ఉంది. సర్కార్ మద్యం దుకాణాలు రద్దయి ప్రైవేట్ దుకాణాలు రానున్నాయి. అందు కోసం ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. 2009 ఉమ్మడి కర్నూలు జిల్లాలో 234 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రైవేట్ దుకాణాలను రద్దు చేసి ప్రభుత్వ దుకాణాలను ఏర్పాటు చేసింది. అప్పట్లో 20 శాతం దుకాణాలను తగ్గించి 2019-20లో 187 దుకాణాలకు అనుమతి ఇచ్చారు. 2020-21లో మరలా 13 శాతం తగ్గించారు. 147 దుకణాలు మాత్రమే నడిచాయి. కొద్ది రోజుల తర్వాత ఎలైట్ మాల్, టూరిజం ప్రాంతాలలో అనుమతి పేరుతో జిల్లాలో మరో 6 దుకాణాలకు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం 148 మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. ప్రైవేట్ దుకాణాలకు ఈ వేలం విధానం అమలు పరిచే అవకాశాలు ఉన్నాయి, జిల్లాలో ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేయాలనే విషయంపై కసరత్తు ప్రారంభమైంది.

ఆనందంలో ఉద్యోగులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 14: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగాన్ని ఎక్సైజ్‌లో విలీనం చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం సీఐలు రాజేంద్ర ప్రసాద్, నరసానాయుడు, రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర బ్యానర్లకు క్షీరాభిషేకం చేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ గత ఐదేళ్లలో సెబ్ విభాగంలో ఎన్నో రకాల ఇబ్బందులు పడ్డామని, ఎక్సైజ్ శాఖలోకి మళ్లీ విలీనం చేయడం వల్ల ఉద్యోగులకు ఉద్యగ భద్రతతో పాటు వృత్తికి న్యాయం జరుగుతుందని అన్నారు. సెబ్ విభాగం వల్ల ఎవరు ఎలాంటి విధులు నిర్వహిస్తున్నామో అర్థం కాని పరిస్థితుల్లో కాలం వెళ్లదీయాల్సి వచ్చిందని వారు అన్నారు.



సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

మళ్లీ ఎక్సైజ్ స్టేషన్లు తెరపైకి..

ఎన్నో ఏళ్ల నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ విధులు నిర్వర్తిస్తోంది. 2019లో జగన్ అధికారం చేపట్టిన తర్వాత ఈ శాఖను కకావికళం చేశారు. సొంత లబ్ధి కోసం స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్(సెబ్)ను తెరపైకి తెచ్చారన్న విమర్శలు వచ్చాయి. అబ్కారీ శాఖలోని 70 శాతం మంది సిబ్బందిని సెబ్‌కు కేటాయించి, వారికి బాస్‌గా పోలీసు ఉన్నతాధికారిని నియమించారు. ఎక్సైజ్ శాఖను కేవలం నాసిరకం మద్యాన్ని విక్రయించడానికే పెట్టారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో కూటమి అధికారంలోకి రావడం..సెబ్ విభాగాన్ని రద్దు చేసి ఎక్సైజ్ లోకి విలీనం చేయడం లాంటి ప్రక్రియను వేగవంతంగా చేసింది. ఫలితంగా దీంతో కర్నూలు-7, నంద్యాల -7 స్టేషన్లను, చెక్ పోస్టులను ఎక్సైజ్ శాఖలోకి వీలీనం చేస్తూ జీవో జారీ చేసింది. మరో వైపు ప్రైవేట్ మద్యం పాలసీ ప్రక్రియకు అవసరమైన చర్యలు సాగుతున్నట్లు సమాచారం.

లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్దీ

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 14: కక్షిదారులకు రాజీ మార్గమే రాజమార్గం అని, లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్దీ అన్నారు. నగరంలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జీవితంలో ప్రతి వ్యక్తికి సమయం చాలా విలువైనదని, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందడానికి కృషి చేసుకోవాలని సూచించారు. కక్షిదారులు చిన్న చిన్న విషయాలకు కోర్టులను ఆశ్రయించి తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లో సామరస్యంగా చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లలో రాజీకీ వీలున్న క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు కూడా పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. కక్షిదారులు తమ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే ఇక తిరుగు ఉండదని ఆయన తెలిపారు. నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారి జి.ప్రతిభా దేవి మాట్లాడుతూ కక్షిదారులు తమ చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కోర్టులను ఆశ్రయిస్తుండటంతో కేసుల సంఖ్య పెరిగిపోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మహిళా కోర్టు న్యాయాధికారి భూపాల్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి పాండురంగారెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి పి.దివాకర్, జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.జ్యోత్స్న దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్దీ

పెరిగిన ఉల్లి ధర


క్వింటం గరిష్ఠ ధర రూ.4,211

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 14: ఉల్లి ధర రోజురోజుకు భారీగా పెరిగిపోతోంది. శనివారం రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లి ధర గరిష్ఠంగా రూ.4,211కు చేరింది. ఒక్క రోజులోనే క్వింటానికి రూ.600 దాకా పెరగడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మధ్యస్థ ధర రూ.3,210, కనిష్ఠ ధర రూ.297 రైతులకు దక్కింది. గత పది రోజులుగా వర్షాలకు ఉల్లిగడ్డలు పూర్తిగా తడిసి కుళ్లిపోయాయని, అందువల్లనే నాణ్యత లేని ఉల్లికి రూ.297 మాత్రమే రైతులకు అందినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవింద్ తెలిపారు.



శ్రీశైల జలాశయానికి తగ్గిన ఇన్‌ఫ్లో

శ్రీశైలం, సెప్టెంబరు 14: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శనివారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 55,465 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17,916 క్యూసెక్కులు మొత్తం 73,381 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 75,895 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.00 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 210.0320 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31094 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.



శ్రీశైల జలాశయం

ధర పతనం
మిరప పంటను దున్నేస్తున్న రైతులు


జూపాడుబంగ్లాలో మిరప పంటను దున్నేస్తున్న రైతు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 14: పచ్చి మిరప ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కిలో మిర్చి ఏడు రూపాయాలకు పడిపోయింది. పచ్చిమిరప కాయలు తెంచడానికి కూలీ ఒక్కొక్కరికి రూ. 250 నుంచి రూ.300 ఉండటంతో మిరపకాయలు అమ్మిన కూడా కూలీలకు డబ్బులు సరి పోక అప్పుతెచ్చి ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని మిరపరైతులు వాపోతున్నారు. ధర లేకపోవడంతో జూపాడుబంగ్లా, తంగడంచ గ్రామాల్లో మిరప తోటలను రైతులు దున్నేస్తున్నారు. మండలంలో వందల ఎకరాలు సాగుచేసి అధి కంగా పెట్టుబడులు పెట్టడం వెరసి ధరలేకపోవడంతో రైతులు దిక్కుతోచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

రూ. 2.5 లక్షల అప్పులయ్యాయి



రెండు ఎకరాలు రూ.40వేలకు కౌలుకు వేసుకుని పచ్చిమిర్చి సాగుచేశాను. మూడుకోతలు కోసిన కూడా కిలో ఏడు రూపాయల కంటే పెరగడంలేదు. పంట అమ్ముకున్న కూడా కూలీలకు సరిపోగా అప్పుతెచ్చి ఇవ్వాల్సి వస్తుంది. మూడుకోతలు కోసిన నష్టమే. రెండెకరాలు సాగుచేయడానికి ఇప్పటికే రూ.2.5 లక్షలు ఖర్చుచేశా. అప్పే మిగిలింది

.- మనోహర్‌రెడ్డి, జూపాడుబంగ్లా

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు
వేలాదిగా తరలివచ్చిన భక్తులు


మఠం ప్రాంగణంలో భక్తులు

మంత్రాలయం, సెప్టెంబరు 14: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రెండో శనివారం, ఆదివారం, సోమవారం వరుసగా మూడు రోజులు సెలవు దినాలు కావడంతో ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో మంత్రాలయం మఠం ప్రాంగణం, మధ్వమార్గ్ కారిడార్ కిక్కిరిసింది. క్యూలో ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. నదితీరం, ప్రధాన రహదారులు, బస్టాండు ప్రాంతం, రాఘవేంద్రసర్కిల్ భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు గదులు దొరక్క ఇబ్బందులు పడ్డారు.

లోక కల్యాణార్థం సుదర్శన హోమం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం లోక కల్యాణార్థం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. భాద్రపద శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని వేలాదిమంది భక్తులకు తప్త ముద్ర ధారణ చేసి భక్తులను ఆశీర్వదించారు.

మహిళా సాధికారత కేంద్రాన్ని అభివృద్ధి చేస్తాం
కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు


సమస్యలు తెలుసుకుంటున్న కర్నూలు ఎంపీ నాగరాజు

కర్నూలు(హస్పిటల్), సెప్టెంబరు 14: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలో ఉన్న ఎన్టీఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మహిళా ప్రాంగణం అభివృద్ధికి సహకరిస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం ఆయన మహిళా సాధికారత కేంద్రాన్ని ఎంపీ పరిశీలించారు. ఈ కేంద్రంలో అభాగ్యులైన మహిళలకు ఎన్నో సేవలు అందుతున్నాయని , నిధుల కొరత ఉందని అధికారి అంజనీభూషణ్ ఎంపీ దృష్టికి తీసుకునిరాగా, తన సొంత ఖర్చులతో సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఆసుపత్రి నుంచి నీరు ప్రాంగణంలోనికి ప్రవహిస్తుందని ఎంపీకి ఫిర్యాదు చేశారు. సీఎస్ఆర్ నిధుల కింద ప్రాంగణంను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ శిక్షణలు నిర్వహించేలా కలెక్టర్‌తో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ వీరశైవ సాధికారత సమితి కన్వీనర్ ఎస్వీ శివరాజు, మల్లికార్జునప్ప, చంద్రశేఖరప్ప, వీరశేఖరప్ప, రాజేంద్రప్రసాద్, ఉపేంద్ర గౌడు పాల్గొన్నారు.

కర్నూలు కేంద్రంగా కాంగ్రెస్ పాలన


పీసీసీ ప్రధాన కార్యదర్శిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 14: వైసీపీ తరహాలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల కాంగ్రెస్ పాలన కర్నూలు కేంద్రంగా సాగుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి మూసాని శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం రెండు జిల్లాల డీసీసీ అధ్యక్షులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్, పరిగెల మురళీకృష్ణలతో పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఆస్తులు ఎన్ని ఉన్నాయి. నెలా నెల అద్దె రూపంలో సమకూరుతున్న లెక్కలు.. ఇంత వరకు దేనికి ఖర్చు చేశారు.. ఇకపై ఎలా నిధుల వాడలో అనే దానిపై పలు సూచనలు చేశారు. ఆదాయంలో నుంచి రెండు జిల్లాలకు ఖర్చు చేయాల్సిన అవసరం ఉందని, అధిష్టానం సూచించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేసేందుకు ఉమ్మడి జిల్లాలు ఒకే కార్యచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. అంతక ముందు నగర అధ్యక్షుడు షేక్ జిలానీ ఆధ్వర్యంలో మూసాని శ్రీనివాస రెడ్డిని శాలువతో సన్మానించారు. సేవాదళ్ జిల్లా అధ్య క్షురాలు వెంకటసుజాత, సత్యనారాయణ గుప్త, నాయకులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో ఆళ్లగడ్డ వాసి గల్లంతు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 14: అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు గ్రామ శివారులో ఉన్న హెచ్చెల్సీ కాలువలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన ఓ వ్యక్తి గల్లంతైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు శనివారం ఏకాదశి సందర్భంగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన రాజ్‌కుమార్(51) అనే వ్యక్తి ఉంతకల్లు గ్రామంలోని రుక్మిణీపాండురంగస్వామి ఆలయానికి తులసీమాల ధరించేందుకు వచ్చాడు. స్నానం చేసేందుకు హెచ్చెల్సీలో దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. రాజ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రాజెక్టుల రూపకర్త మోక్షగుండం

- ప్రపంచ ఖ్యాతి నిర్మాణాలు చేపట్టిన గొప్ప వ్యక్తి విశ్వేశ్వరయ్య
- నేడు ఇంజనీర్స్ డే



కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 14: దేశంలోనే తొలిసారిగా నీటి వృథాను అరికట్టేందుకు బ్లాక్ సిస్టమ్‌కు రూపకల్పన చేసిన వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. అలాగే వర్షపు నీటిని ప్రాజెక్టుల ద్వారా నిలుపుదల చేయడం, ప్రవహించే నీటిని ఆనకట్టలు, ఉక్కు తలుపుల ద్వారా అరికట్టడానికి రూపకల్పన చేశారు. కొన్ని క్షణాల్లో ఈ వంతెన కోల్పోతుంది. రైలును ఆపండి.. అంటూ కేకలు వేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన మేధావి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన జయంతిని పురస్కరించుకొని 1968 నుంచి సెప్టెంబరు 15వ తేదీని ఇంజనీర్స్ డే జరుపుకుంటున్నాం. ఇంజనీరింగ్ రంగంలో ఆయన చేసిన కృషికి గానూ భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్యను 1955లో భారతరత్న బిరుదుతో సత్కరించింది.

ప్రపంచ ఖ్యాతి నిర్మాణాలు

ఆధునిక భారతదేశంలో ఆనకట్టలు, రిజర్వాయర్లు, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణంలో విశ్వేశ్వరయ్య కీలక పాత్ర పోషించారు. ఇంజనీర్‌గా మనదేశ ఖ్యాతిని నలుదిశలా చాటారు. ఈ రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి ప్రపంచ ఖ్యాతి నిర్మాణాలను ఆవిష్కరించారు. ఆయన మార్గదర్శకత్వంలో నిర్మాణాలు నేటికీ చెక్కు చెదరలేదు. విశాఖపట్నం సాగరతీరం నుంచి రక్షించే వ్యవస్థను రూపొందించి చిరస్మరణీయుడిగా చరిత్రలో నిలిచిపోయారు. ఆసియాలోనే మొదటి విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు నెలకొల్పారు. అంతేకాదు కోట్లాది మంది భక్తులు ప్రయాణించే తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. హైదరాబాదును వరదలు ముంచెత్తుతున్న సమయంలో నైజాం సూచనల మేరకు ఉస్మాన్‌సాగర్ హిమయత్ సాగర్ జలాశయాలు నిర్మించారు. దేశంలోని కొన్ని పట్టణాలలో మంచినీటి పథకాల నిర్మాణాలకు రూపకల్పన చేశారు. దేశంలోనే తొలి ఉక్కు కర్మాగారం నిర్మించారు. మైసూరులో కృష్ణరాజు సాగర్ నిర్మించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేపట్టిన నిర్మాణాలు నేటికీ చెక్కు చెదరలేదు. ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి.

డా.జి.రఘురామ్, ప్రొఫెసర్,
కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం,
జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, కర్నూలు

ఇంజనీర్లకు మార్గదర్శకం



ఆంగ్లేయులు చేత ప్రశంసలందుకున్న గొప్ప వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. నవభారత నిర్మాణంలో ఎంతో కృషి చేశారు. ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలి.

- ఆర్.రవీంద్ర, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

సత్తా చాటితే విజేతలు మీరే

- డిగ్రీ విద్యార్థులకు ఆర్బీఐ క్విజ్ పోటీలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 28 వేల మంది డిగ్రీ విద్యార్థులు
- 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

శిరివెళ్ల, సెప్టెంబరు 14: విద్యార్థుల్లోని మేధోశక్తిని పరీక్షించేందుకు.. చదువుతూనే లక్షాధికారులయ్యే అవకాశాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) అందిస్తోంది. ఆర్బీఐ స్థాపించబడి 90 సంవత్సరాలైన సందర్భంగా ఆర్బీఐ-90 పేరుతో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు దేశ వ్యాప్తంగా క్విజ్ పోటీలను నిర్వహిస్తోంది.

ఇలా దరఖాస్తు చేసుకోవాలి : గుర్తింపు పొందిన కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ క్విజ్ పోటీలకు అర్హులు. సెప్టెంబరు 1, 2024 నాటికి 25 సంవత్సరాల వయస్సు ఉండాలి. ఆసక్తి, అర్హత కలిగిన డిగ్రీ విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆర్బీఐ90క్విజ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్‌లో స్టూడెంట్స్ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేసి రాష్ట్రం, జిల్లా, చదువుతున్న కళాశాలతో పాటు విద్యార్థుల పేర్లు, ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ తదితర వివరాలు నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో నమోదకు గాను విద్యార్థులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. విద్యార్థులు ఒక్కో బృందానికి ఇద్దరు చొప్పున దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

19వ తేదీ నుంచి 21 వరకు పోటీలు : ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ నుంచి 21 వరకు (ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు) క్విజ్ పోటీలు జరుగుతాయి. క్రీడలు, చరిత్ర, సైన్స్ అండ్ టెక్నాలజీ, సమకాలీన, వర్తమాన వ్యవహారాలు, ఆర్ట్ అండ్ లిటరేచర్, ఆర్థిక వ్యవస్థ తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి. ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రశ్నలు ఇస్తారు. నాలుగు దశల్లో నిర్వహించే ఈ క్విజ్ పోటీల్లో మొదట జిల్లా, రాష్ట్రం, జోనల్ అనంతరం జాతీయస్థాయిలో ఫైనల్ పోటీలను నిర్వహిస్తారు.


యర్రగుంట్ల డిగ్రీ కళాశాల విద్యార్థులు

వరద బాధితులకు యునైటెడ్ క్లబ్ చేయూత


మంత్రికి చెక్కును అందజేస్తున్న యునైటెడ్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సహాయార్థం కర్నూలు యునైటెడ్ క్లబ్ కార్యవర్గ కమిటీ రూ.2 లక్షలు అందించాలని తీర్మానించింది. ఈమేరకు శనివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు నగరంలోని మౌర్య ఇన్‌లోగల ఆయన కార్యాలయంలో రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు యునైటెడ్ క్లబ్ అధ్యక్షుడు కె.భీమేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. బలరాం, కోశాధికారి ఎస్.సుధాకర్ బాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వై. ఏసురత్నం, వి. రాముడు, సభ్యులు రాంభూపాల్ రెడ్డి, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 14: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని మంత్రి చాంబర్‌లో కర్నూలు క్లబ్ అసోసియేషన్ రూ.5 లక్షలు అందజేశారు. కర్నూలు నియోజవర్గం టీడీపీ 4వ వార్డు తరపున వార్డు ఇన్‌చార్జి రమేష్ బాబు, బూత్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో సేకరించిన రూ.60 వేలు, 48వ వార్డు 3వ బూత్ ఇన్‌చార్జి కేతు మధులతాగౌడ్ రూ.30 వేల విరాళం చెక్కుల అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బాల చంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీ చంద్రమౌళీశ్వరరెడ్డి, ట్రెజరర్ కేతు శివరామ్ గౌడ్, కార్తీక్, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం లారీ పట్టివేత.. 250 బస్తాలు స్వాధీనం

నంద్యాల క్రైం, సెప్టెంబరు 14 : నంద్యాల నుంచి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న బియ్యం బస్తాల లారీని పట్టుకున్నట్లు టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ శనివారం తెలిపారు. బియ్యం బస్తాల లారీని స్థానిక మునిసిపల్ కార్యాలయ సమీపంలో పట్టుకొని అందులోని 250 బస్తాలను సీజ్ చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నగేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా రేషన్ బియ్యాన్ని నంద్యాలలో అక్రమంగా సేకరించి అక్రమ రవాణాకు పాల్పడి సొమ్ము చేసుకుంటున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చీటింగ్ కేసులో వ్యక్తికి రిమాండ్

నంద్యాల క్రైం, సెప్టెంబరు 14 : ఓ చీటింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రీనివాస హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కటకం భరత్‌కుమార్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. అరెస్ట్ చేసి జడ్జి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఇదే కేసులో పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా/మిడుతూరు, సెప్టెంబరు 14: వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనలు జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల్లో చోటు చేసుకున్నాయి. జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలోని కేజీరోడ్డుపై శుక్రవారం రాత్రి ఎదురెదురుగా మోటారుసైకిళ్లు ఢీకొని తంగడంచ గ్రామానికి చెందిన మాదన్న, తాటిపాడు గ్రామానికి చెందిన చెన్నరాయుడు, తిక్కస్వామి గాయపడ్డారు. 108లో కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే మిడుతూరు మండల పరిధిలోని అలగనూరు గ్రామ సమీపంలో బైక్‌పై నుంచి అదుపు తప్పి కింద పడి విద్యపోగుల దేవరాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బంధువు అంత్యక్రియల్లో పాల్గొని సొంత గ్రామానికి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకున్నది. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో మిడుతూరు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స నిర్వహించి కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గోల్డ్ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్ ప్రారంభం


ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 14 : అన్సర్ డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్‌ను నంద్యాలలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథులుగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన గోల్డ్, డైమండ్స్‌ను వారు తిలకించారు. వారు మాట్లాడుతూ అన్సర్ జ్యువెల్లరీ నాణ్యతతో, నమ్మకమైన గోల్డ్ డైమండ్లను అందించడం అభినందనీయమన్నారు. మార్కెట్‌తో పోల్చుకుంటే సరసమైన ధరలకే నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలు అన్సర్ జ్యువెల్లరీ ప్రత్యేకత అని అన్నారు. మూడురోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ కేంద్ర పాలక సభ్యుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గంగిశెట్టి విజయకుమార్, విశ్వనాథరెడ్డి, మిద్దె ఉసేని, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో హ్యాండ్ రిటన్ బైబిల్‌కు స్థానం

160 మంది మహిళతో హ్యాండ్ రిటన్ బైబిల్

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 14: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానంలో బైబిల్ రీడింగ్ చాలెంజ్ టీమ్ ఇండియా సభ్యులు సాధించారని ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి రాజ్ లూత్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక నగర శివారులోని పుల్లారెడ్డి కాలేజీ సమీపంలో ఆర్‌సీ కన్వెన్షన్ (రేమా చర్చ్)లో దేశ నలుమూలల నుంచి వచ్చిన 160 మంది మహిళలు పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌ను 8 గంటల వ్యవధిలో రాశారని తెలిపారు. ఇది ప్రపంచంలోనే మొదటిసారి నమోదైన రికార్డు అని నిర్వాహకులు జూలి ఫ్రాన్సిస్ కందుకూరి, మేరీ జోష్న కందుకూరి, గొటికల బ్యూలా పాలిన్, మేరీ ప్రశాంతి కందుకూరి తెలియజేశారు. ఈ సందర్భంగా దేశ నలుమూలల నుంచి పాల్గొన్న 160 మంది మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి రాజ్ లూత్ర

నిందితుల అరెస్టు

పెద్దకడుబూరు, సెప్టెంబరు14: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి కేసులో పదిమందిని నిందితులను అరెస్టు చేసినట్లు శనివారం ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హనుమాపురం గ్రామ సమీపంలోని, కల్లుకుంట గ్రామంలోని చాకలి భూలక్ష్మి, చాకలి నరసమ్మ, చాకలి లక్ష్మి, చాకలి పెద్దరంగమ్మ, చాకలి నాగరాజు, చాకలి హుసేని, చాకలి రాముడు, చాకలి భీమరాజు, చాకలి గుండమ్మను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలో 30యాక్టు అమలులో ఉంటుందని పోలీసులు చెప్పారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

నందికొట్కూరు, సెప్టెంబరు 14: నందికొట్కూరు పట్టణ శివారులో ఉన్న పోతురాజు కుంటలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి మృతి చెందాడు. ఏబీఎం పాలెంకు చెందిన ప్రకాశం(65) శనివారం వ్యవసాయ పనుల్లో భాగంగా నీటి కోసం పోతురాజు కుంట వద్దకు వెళ్లి అందులో పడి పోయాడు. పక్క పొలం వారు సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలుపగా కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని సాయంత్రం వెలికితీశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, భార్య ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోసిగి, సెప్టెంబరు 14: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశారు. కోసిగి మండల కేంద్రంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అటాచ్ చేశామన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

గుర్రప్ప స్వామి ఆలయంలో చోరీ

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 14: మండలంలోని ఇంజేడు గ్రామంలో ఉన్న గుర్రప్ప స్వామి ఆలయంలోని హుండీని పగలగొట్టి అందులోని నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఉదయం గ్రామానికి చెందిన గుర్రప్ప ఆలయంను శుభ్రం చేసేందుకు వెళ్లిగా హుండీ తాళం పగిలిపోయి అందులోని నగదు మాయం అయినట్లు గుర్తించాడు. హుండీలో గత రెండేళ్ల క్రితం రూ. 55,550 నగదు, ఇత్తడి వస్తువులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. దాని అంచనాను బట్టి ఇప్పుడు కూడా రూ. 50 వేలకు పైబడి నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఎస్ఐ రామాంజనేయరెడ్డిని వివరణ కోరగా సమాచారం మేరకు విచారణ చేపట్టామని తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

పత్తికి దోమపోటు

» మొక్క ఆకులను తినివేస్తున్న పురుగు
» వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలి

ఓర్వకల్లు, సెప్టెంబరు 14: పత్తి పంటను పురుగు తినేస్తోంది. మొక్కలపై పురుగు పోటు అధికంగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని హుశేనాపురం, గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, కన్నమడకల, హుడిచెర్ల, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, కొమరోలు తదితర గ్రామాల్లో దాదాపు ఎనిమిదివేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. అయితే భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో తెల్లదోమ, పచ్చదోమ వ్యాపించి రసం పీల్చడం వల్ల ఆకుముడత తెగుళ్లతో పత్తి పంట నాశనం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది పత్తికి గిట్టుబాటు ధర ఉండటంతో.. ఈ ఏడాది మండలంలో అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేశారు. అయితే.. రసం పీల్చే పురుగును నివారించేందుకు క్రిమిసంహారక మందులు పిచికారి చేసినా తగ్గడం లేదని రైతులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులతోనే పురుగు ఉధృతంగా ఉందని రైతులు అంటున్నారు. ఎకరాకు దాదాపు రూ.10వేలకు పైగా పెట్టుబడి పెట్టామని.. అయినా పంటకు సోకిన పురుగును నివారించలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు.


తెగుళ్లు సోకిన పత్తి పంట

తీవ్రంగా నష్టపోతున్నాం



పత్తి పంట తెగుళ్ల నివారణకు ఎన్ని క్రిమిసంహారక మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు. 20 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టాం. అయితే.. పురుగు ఉధృతి తగ్గడం లేదు. దీంతో దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదు.

- ఆదాం బాషా, రైతు, ఓర్వకల్లు

పురుగు ఉధృతి అధికం



గత ఏడాది పత్తికి మార్కెట్‌లో ధర బాగా ఉండటంతో అధిక విస్తీర్ణంలో పత్తిని సాగు చేశాం. పత్తి పంటపై దోమపోటు అధికంగా ఉంది. దీంతో ఆకులను పీల్చడంతో ఆ ఆకులు వాడు పడుతున్నాయి. దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

- మధుమోహన్, రైతు, హుశేనాపురం

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



పత్తి పంటపై పచ్చదోమ, తెల్లదోమ అధికంగా ఉంది. రైతులు తక్షణమే పంట సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. పత్తి పంటపై పచ్చదోమ, తెల్లదోమను నివారించేందుకు క్లోనిక్‌మైడ్ మందును ఎకరాకు 60 గ్రాముల లీటరు నీటితో కలిపి పంటపై పిచికారీ చేయాలి.

- సుధాకర్, ఏవో

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల


గాడిచర్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కల్కూర, కేజీ గంగాధరరెడ్డి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 14: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు అని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు కేసీ కల్కూర, కేజీ గంగాధరరెడ్డిలు కొనియాడారు. శనివారం గాడిచర్ల హరిస ర్వోత్తమరావు జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గాడి చర్ల చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, చంద్రమ్మ పాల్గొన్నారు.

రేపు వినతుల స్వీకరణ రద్దు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 14: నగర పాలక కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని 16న రద్దు చేస్తున్నట్లు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మిలాద్‌నబీ పండుగ సెలవు కారణంగా రద్దు చేసి నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

'సకల శుభాలకు ఆదిదేవుడు గణపతి'


అన్నదానం చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 14: సకల శుభాలకు ఆది దేవుడు గణపతి మూర్తి అని, ఆయన ఆశీస్సులు ఉంటే ఆయా రంగాల్లో ఉన్నతంగా రాణించ వచ్చని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో సామాజిక సేవకురాలు మీసాల సుమలత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


వినాయకునికి పూజలు చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు (కలెక్టరేట్), సెప్టెంబరు 14: వినాయక చవితి సందర్భంగా జర్నలిస్టులు మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావడం అభినందనీయమని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. శనివారం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఆవరణలోని మీడియా సెంటరు వద్ద పాత్రికేయ గణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు గణపతికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని, వారికి ఆశించిన స్థాయిలో వేతనాలు లేనప్పటికీ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు.

వరద బాధితులకు విరాళం


నారా లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: విజయవాడలో వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు సీఎం సహాయ నిధికి రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా రూ.11 లక్షల నగదును కర్నూలు చెందిన డాక్టర్ కేవీ ఎస్‌ఆర్ విద్యాసం స్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి అందజేశారు. శనివారం అశోకా కళాశాల ఆడి టోరియంలో జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో కేవీ సుబ్బారెడ్డిని శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు తెలుగు బోధించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: పాఠశాలల్లో ఇంగ్లీషుతో సమానంగా తెలుగు విద్యార్థులకు బోధించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కేకే భవన్‌లో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గూడూరులో జరిగే జిల్లా మహాసభలకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, మహిళా సహాధ్యక్షురాలు జీవిత, రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా కార్యదర్శి జమ్మన్న, గాదె లింగప్ప, దుర్గ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు చొరవతో ఓ పేద విద్యార్థినికి ల్యాప్ టాప్ అందింది. నగరంలోని విఠల్‌నగర్‌కు చెందిన హసీని గాయత్రీ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం ఐఐటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినికి ల్యాప్‌టాప్ అవసరం కావడంతో కొద్ది రోజుల క్రితం ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిశారు. స్పందించిన ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ కెనరా బ్యాంకు ద్వారా సీఎస్‌ఆర్ నిధులతో హసీనికి ల్యాప్‌టాప్ మంజూరు చేయించారు. దీంతో ఎంపీ బస్తిపాటి నాగరాజును ఆయన నివాసం కలిసి విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 14: మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుక 'మిలాద్-ఉన్-నబీ'ని పురస్కరించుకొని మిలాద్ సెంట్రల్ కమిటీ, లైఫ్ యువ నేత్ర సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు లైఫ్ యువ నేత్ర సేవా సమితి అధ్యక్షుడు డి.షేక్షావలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాజ్‌విహార్ సర్కిల్‌లోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందని తెలిపారు. శిబిరాన్ని నగర ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బకాయిలు వసూలు


బకాయిలు వసూలు చేస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు


కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 14: నగర పాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాల అనుమతి ఫీజు బకాయిలు రూ.25లక్షలు వసూలు చేశారు. శనివారం లోక్ అదాలత్ అధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో పట్టణ ప్రణా ళికా విభాగం ఏర్పాటు చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు దాదాపు 95 మంది నుంచి రూ.25 లక్షల వసూలు చేసినట్లు సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. 674 మంది బకాయిదారులకు నోటీసులు ఇచ్చామన్నారు. మిగిలిన బకాయిలను కూడా లోక్ అదాలత్ ద్వారా వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు రంగస్వామి, శశికళ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ దామోదర్, సూపరింటెండెంట్ సుబ్బన్న, సీనియర్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హి సేవా'ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న సూర్యనారాయణ

గూడూరు సెప్టెంబరు 14: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెప్మా టీఎంసీ సూర్యనారాయణ అన్నారు. శనివారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ రవికుమార్, మెప్మా టీఎంసీ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సోమయాజులపల్లెలో వినాయకుడికి పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 14: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని సోమయాజులపల్లె ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి 8వ రోజు శనివారం పూజలు చేశారు. మండలంలోని సోమయాజులపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి భక్తులు పూజలు నిర్వహించారు. ఆదివారం వినాయకుని నిమజ్జనం, సాంస్కృతిక కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఈ ఏడాదైనా గట్టెక్కించు స్వామీ..

వినాయకుడిని వేడుకున్న కూరగాయల రైతులు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 14: కొన్ని సంవత్సరాలుగా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు చేతికందక అప్పుల్లో కూరుకునిపోయాము ఈ యేడాదైనా పంటలు చేతికొచ్చేలా చూడు స్వామి అంటూ అన్నదాతలు గణనాథున్ని వేడుకున్నారు. నగరంలోని సీ.క్యాంపు రైతుబజారులో కూరగాయల రైతులు ఏర్పాటు చేసిన గనాథుడి వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. అంతకుముందు పూజలు చేశారు. కార్యక్రమంలో రైతులు, పొదుపులక్ష్మి గ్రూపు మహిళలు, ఎస్టేట్ అధికారి హరీశ్‌కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులు శ్రీనివాసరెడ్డి, చిన్నస్వామి, హనుమంతు, గోపాల్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల


ఊడి పడిన పాఠశాల తరగతి గది పైకప్పు

సి.బెళగల్, సెప్టెంబరు 14: మండల కేంద్రంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల శిథిలావస్థకు చేరింది. గురుకుల పాఠశాలలో 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదులు పెచ్చులూడి పడుతుండటంతో ఎప్పుడు గదులు కూలిపోతాయోనని విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చదువులు కొనసాగిస్తున్నారు. సంబం ధిత అధికారులకు తెలిపినా కూడా స్పందిం చడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరుగకముందే ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాల నిర్మాణానికి కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు రాముడు, వెంకటేశ్, రాములమ్మ, ఎస్తేరమ్మ కోరుతున్నారు.

పోరాట స్ఫూర్తికి ప్రతిరూపం ఏపీటీఎఫ్: ఎంపీ

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్య వైజ్ఞానిక మహాసభలు నిర్వహించడం శుభపరిణామమని కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఏపీటీఎఫ్ జిల్లా విద్యా మహాసభ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ హాజరై మాట్లాడుతూ ఏపీటీఎఫ్ పోరాట స్ఫూర్తిగల సంఘమని, ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసే సంస్థ అని అభివర్ణించారు. 117జీవో రద్దు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో విద్య, వైద్యం అభివృద్ధి కోసం పని చేస్తామని తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఘన చరిత్రను వివరిస్తూ నాయకత్వ పోరాటాలతో నేడు ఉపాధ్యాయులు పొందుతున్న అన్ని సౌకర్యాలు ఏపీటీఎఫ్ ద్వారా వచ్చాయన్నారు. ఐఫియా జాతీయ చీఫ్ పాట్రాన్ కే.సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో హింసాత్మక, ప్రవృత్తి, విపరీత ధోరణలు, పరిష్కారాలు అనే అంశంపై చర్చించారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి కే.కుల శేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మధుసూదన్‌రావు, మహ్మద్ రఫీ, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి మరియానందం, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ఎన్టీయే జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నంద్యాల జిల్లా నాయకులు, ఎంఈవోలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి: ఎంపీ

కర్నూలు(అర్బన్): విద్యార్థులు క్రమ శిక్షణతో మెలిగితే అన్ని రంగాల్లో మంచి ఫలితాలు సాధిస్తారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై మాట్లాడారు. గతంలో తాను చదువుకున్న కళాశాలకే ఇప్పుడు ముఖ్యఅతిథిగా హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. తాను చదువుతో పాటు ఎన్నో కష్టాలు అధిగమించి ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ శాంతా, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఏవో శౌరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 14: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి సీపీఎంతో పాటు అనుబంధ సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం కార్మిక కర్షక భవన్, పాతబస్తీ, కల్లూరు, సుందరయ్య కూడలి తదితర ప్రాంతాలలో ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీతారాం ఏచూరి మృతి శ్రామిక ప్రజానీకానికి, సీపీఎంకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, పి.నిర్మల, ఎండీ అంజిబాబు, ఆనంద్‌బాబు, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నగేష్, అధ్యక్షుడు రాఘవేంద్ర, షరీఫ్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామంలో సీపీఎం శాఖ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి శనివారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా నాయకుడు జి.మధు, సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, రంగస్వామి, నాగమ్మ హాజరై మాట్లాడారు. సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. నాయకులు పద్మావతి, ఈశ్వరమ్మ, వెంకటస్వామి, నాగరాజు, సిద్దన్న, శేషాద్రి, శేఖర్, గఫూర్‌మియా, వెంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెగ్యులర్, హెచ్‌ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర కో చైర్మన్ మహ్మద్ రఫీ డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో సమగ్ర శిక్ష ఎస్ఎస్ఏ రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు కాంతారాము అధ్యక్షతన రాయలసీమ ప్రాంతీయ సమగ్ర శిక్ష సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ రెగ్యులర్ హెచ్‌ఆర్ పాలసీ మినిమం టైం స్కేల్ ఉద్యోగ భద్రత జీతాలు ఒకటో తేదీన వచ్చేటట్లు రాష్ట్ర సంచాలకులు వార్షిక బడ్జెట్ విడుదల చేయాలన్నారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. సమావేశంలో సహాధ్యక్షుడు మహ్మద్ రఫీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు, నంద్యాల జిల్లా నాయకుడు ఏ.నాగరాజు, ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రాజు, సలహాదారు బాబు, ప్రధాన కార్యదర్శి రంగన్న, జిల్లా కోశాధికారి జగదీష్, జేఏసీ నాయకులు శాంతి, నాగరత్నమ్మ, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.


స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని అచ్యుతానంద స్వామి అన్నారు. స్వామి వివేకానంద 158 జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో వివేకానంద స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుతానంద స్వామి, డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ లక్ష్య సాధనకు యువత నిరంతరం శ్రమించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్, సుదాకర్, అధ్యాపకులు రామకృష్ణ, లోకేశ్, మల్లికార్జున, సోమేష్, పార్థసారధి పటేల్, చిన్న మల్లేశ్వరుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 14: ప్రతి ఒక్కరు భగవద్గీత పారాయణం చేయాలని ధర్మ ప్రచారకులు విశ్వనాథ గురూజీ అన్నారు. శనివారం నగరంలోని సంకల్‌భవాగ్‌లో గల గీతా ప్రచారధామంలో ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం అధ్యక్షులు డీవీ రమణ, ఇల్లూరు రమణ, సింహాద్రి రమేష్, జగన్నాథ గుప్త, మహబలేష్ పాల్గొన్నారు.

ఎన్టీయే క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: కేఈ ప్లాజాలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్టీయే జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.నాగరాజు, సహాధ్యక్షులు సురేష్ గౌడు, సింగో టం, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున, జయచంద్ర పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణకు కృషి చేయాలి

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 14: ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాఠశాల కరస్పాండెంట్ యేసుదాసు అన్నారు. గౌతమి నగర్‌లోని గుడ్‌షప్పర్డ్ పాఠశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోల్స్ సెంటీరియల్ చర్చి వార్షికోత్సవం


కోల్స్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న క్రైస్తవులు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 14: నగరంలోని కోల్స్ సెంటీరియల్ తెలుగు బాపిస్టు చర్చి 106 వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చర్చిలో నిర్మించిన కోల్స్ అకర్ మాన్ దొర విగ్రహానికి జీసెస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు జింకల రవికుమార్ అధ్వర్యంలో శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మౌర్య ఇన్‌లో చర్చి చరిత్ర, మినిస్ట్రీస్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను మంత్రి టీజీ భరత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదానందం, ప్రసాదరావు, మనోహర్ పాల్గొన్నారు.


కర్నూలు(స్పోర్ట్స్): కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు 106వ చర్చి డే సందర్భంగా సంఘ స్థాపకుడు అబ్రహం లింకన్ కోల్స్ దొర విగ్రహానికి ఇవాంజెలికల్, సపోర్టింగ్ టీం సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఈఎస్టీ ఫౌండర్ డైరెక్టర్ దాసరి సుధీర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఈఎస్టీ సభ్యులు సురేష్, జయాకర్, డేవిడ్ పాల్, జయపాల్, ప్రవీణ్, మోజేస్, విజయ కుమారుడు, సాగర్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: స్థానిక కేవీఆర్ గార్డెన్‌లోని కేవీఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ సాదూ శ్రీనివాసరెడ్డి హాజరై హిందీ భాష గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, హిందీ ఉపాధ్యాయులు నసీమున్నీసా, ఇంద్రాణి పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు కూల్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వాటర్ ట్యాంకును కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

ఓర్వకల్లు, సెప్టెంబరు 14: ఓర్వకల్లులో ప్రమాదకరంగా నీటి ట్యాంకు.. భయాందోళనలో కాలనీవాసులు అన్న శీర్షికన జూలై 31న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. శనివారం అధికారులు స్పందించి వాటర్ ట్యాంకును ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. టీడీపీ గ్రామ నాయకులు గోవిందరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి పర్య వేక్షణలో ట్యాంకు చుట్టు ఉన్న కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కూల్చివేతను మొదలు పెట్టారు. నూతన ట్యాంక్ నిర్మాణానికి నిధులు త్వరితగతిన మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. అలాగే మండలంలోని సోమయాజులపల్లె, చెన్నంచెట్టిపల్లె, కాల్వ, కొమరోలు తదితర గ్రామాల్లో వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయని, వీటిని తొలగించి నూతన వాటర్ ట్యాంకులు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మిలాద్ ఉన్ నబీని ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు14: మండలంలోని ప్రజలు మిలాద్ ఉన్ నబీని ప్రశాంతంగా చేసుకోవాలని రూరల్ సీఐ విక్రమ్ సింహ కోరారు. శనివారం మాట్లాడుతూ సమస్యలు ఉంటే ముస్లింలు తన దృష్టికి తేవాలని సీఐ కోరారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులు: ఎమ్మెల్యే


ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే పార్థసారధి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 14: ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. శనివారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఐదుగురికి అవార్డులు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. అవార్డు గ్రహీతలు రాజా సతీష్, వెంకటసుబ్బయ్య, వెంకోబా, నరసింహారెడ్డి, ఎల్లప్పను సన్మానించారు. ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న, జిల్లా అధ్యక్షుడు గోకారి, సీ.నాగరాజు, వెంకటేశ్వర్లు రమేష్ నాయుడు, ఎంసీ సుంకన్న, వీరచంద్ర యాదవ్, మహాదేవప్ప, సుంకన్న, శ్రీనివాసులు వెంకటస్వామి మల్లికార్జున రామాంజినేయులు ఎంఈవో రాజేంద్రప్రసాద్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 14: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన సెంట్రింగ్ కూలీ రవి ఇటీవల మృతి చెందాడు. సెంట్రింగ్ అసోసియేషన్ నాయకులు రూ.లక్షను మృతుడి భార్య రత్నమ్మకు శనివారం అందించారు. సెంట్రింగ్ అసోషియేషన్ సభ్యులు వెంకటరాముడు, ఉమాపతి రెడ్డి, శ్రీకాంత్, జావీద్, బుడ్డాబాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేఈ సేవలు మరువలేనివి

మద్దికెర, సెప్టెంబరు 14: వరద బాధితులకు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చేసిన సేవలు మరువలేనివని టీడీపీ నాయకులు మెడికల్ తిమ్మప్ప, బసినేపల్లి తిమ్మప్ప, బసినేపల్లి హరినాథ్‌గౌడు అన్నారు. శనివారం పెరవలి గ్రామంలో మాట్లాడుతూ బాధితులకు తానే స్వయాన పంపిణీ చేశారన్నారు. మాజీ సీఎం జగన్ సహాయం చేయకుండా సీఎం చంద్రబాబుపై నిం'లు మోపడం తగదన్నారు.

నేటి నుంచి జోనల్ క్రీడలు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 14: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జోనల్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి, డాక్టర్ ఫైఫుల్ల తెలిపారు. శనివారం మాట్లాడుతూ ఇండోర్ గేమ్స్ మల్లికార్జున విద్యాలయంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ నెల 22న అవుట్డోర్ గేమ్స్ ఫుట్బాల్, బాస్కెట్బాల్, త్రో బాల్, కబడ్డీ నిర్వహిస్తున్నామని తెలిపారు.

రాజీ మార్గమే రాజ మార్గం

- జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయాధికారులు


ఆలూరులో మాట్లాడుతున్న న్యాయాధికారి హేమ

ఆలూరు రూరల్, సెప్టెంబరు 14: రాజీ మార్గమే రాజమార్గమని, కేసుల్లో ఇరుక్కుని సమయాన్ని వృథా చేసుకోవద్దని న్యాయాధికారి కట్టా హేమ సూచించారు. శనివారం ఆలూరు జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ మోగా లోక్‌అదాలత్ నిర్వహించారు. 59 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వాయుజోత్తమరావు, వలి, న్యాయవాదులు లక్ష్మీకాంత్, ప్రవీణ్ కుమార్, వీరేశ్, రాజేష్ పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: రాజీ మార్గమే రాజమార్గమని పత్తికొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎంఎస్ భారతి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 84 కేసులను పరిష్కరించినట్లు క్లర్క్ రాఘవేంద్ర తెలిపారు. 54 క్రిమినల్, 14 సివిల్ కేసులు, 11 ఈపీ కేసులు, గృహ హింస కేసులు 3, భరణం కేసులు 2 పరిష్కారమైనట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, న్యాయవాదులు నాగభూషణం రెడ్డి, రమేష్‌బాబు, ఎల్లారెడ్డి, హుల్తన్న, సురేష్ కుమార్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సెబ్ రద్దుపై ఎక్సైజ్ సిబ్బంది హర్షం


ఎమ్మిగనూరులో క్షీరాభిషేకం చేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 14 : సెబ్‌ను రద్దు చేసి తమను ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉద్యోగులుగా వీలినం చేయడంపై సీఐ భార్గవ్ రెడ్డి, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. మాతృ శాఖకు రావడం సంతోషకరమని గత వైసీపీ ప్రభుత్వం రాత్రికి రాత్రే జీవోలు తీసుకొచ్చి తమకు అదనపు బాధ్యతలు అప్పగించారని అన్నారు. నరసింహరెడ్డి,రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది నాగరాజు సీఎం, డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

పత్తికొండ టౌన్: ఎక్సైజ్ సీఐ సువర్ణలత, ఎస్ఐ కార్తిక్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. సిబ్బంది సర్దార్, వరదరాజులు, ఈరన్న, వెంకటేశ్వర్లు, రాణిపాల్గొన్నారు.

బాధితులకు కొనసాగుతున్న సాయం


చెక్కును అందిస్తున్న టీడీపీ నాయకులు

హొళగుంద, సెప్టెంబరు 14 : విజయవాడ వరద బాధితుల కోసం హొళగుంద టీడీపీ సీనియర్ నాయకులు చిన్నహ్యాట శేషగిరి, హెబ్బటం విష్ణువర్ధన్ రెడ్డి చెరో రూ.50 వేల చొప్పున రూ.లక్ష చెక్కు సీఎం సహాయ నిధికి ఇచ్చినట్లు శనివారం రాత్రి తెలిపారు. వరద భాధితుల సహాయర్థం చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారని కొనియాడారు. కన్వీనర్ తిప్పయ్య, దుర్గయ్య, తోక వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: రాఘవేంద్ర కాలనీ వినాయక యువకమండలి నిత్యావసరా లను విరాళంగా అందించారు. శనివారం మండలి సభ్యులు బాబు, అంబులెన్స్ బాషా, మెకానిక్ వీరేష్, నవీన్, సాధిక్, హోటల్ వీరేష్ సామాజిక కార్యకర్త మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజుకు అందజేశారు. రజాక్, మల్లెల గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సింగేటి నరసన్న, క్రిష్ణ, సురేష్, పెద్దయ్య, మనోహర్, ఎర్రన్న, సందీప్, ప్రవీణ్ 10 బస్తాల బియ్యాన్ని మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజుకు అందజేశారు. రంగస్వామి, రమేష్, పవన్, రవి, రాజేష్, భరత్, దావీదు, మిథున్ పాల్గొన్నారు.


సరుకులు ఇస్తున్న వినాయక మండలి సభ్యులు

సాంద్రత పద్ధతితో మంచి దిగుబడి

పెద్దకడుబూరు, సెప్టెంబరు 14: అధిక సాంద్రత పద్ధతిలో పంటలను సాగు చేస్తే మంచి దిగుబడులను సాధించవచ్చని బనవాసి కేవీకే సమన్వయకర్త రాఘవేంద్ర చౌదరి తెలిపారు. శనివారం హెచ్.మురవణి, రంగాపురం గ్రామాల్లో పంట కోత ప్రయోగం చేశారు. అధిక సాంద్రత పద్దతి విధానంలో పండించిన పంట దిగుబడిని కొలిచారు. న్యూజివీడు సిరి, సీసీహెచ్369 రకాలను చదరపు మీటరుకు 15 మొక్కలు వేయగా 30 పత్తికాయలు వచ్చాయని, ఒక మీటరుకు పత్తిమొక్క పెరిగిందని, ఎకరాకు 28వేల మొక్కలు విత్తడంతో 25 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని శాస్త్రీయంగా నిర్ధారించామన్నారు. రైతు రవీంద్ర, కరుణప్ప, ఉసేనప్ప, కాలప్ప ఆచారి పాల్గొన్నారు.

శ్రీమఠంలో తమిళనాడు డీజీపీ

మంత్రాలయం, సెప్టెంబరు 14: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం తమిళనాడు డీజీపీ వన్నియ పెరుమాళ్ జీవాల్ శనివారం మంత్రాలయానికి వచ్చారు. నిజ బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీమఠం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పీఠాధి పతి సుబుధేంద్రతీర్థులు డీజీపికి శేషవస్త్రం, రాఘవేంద్రస్వామి జ్ఞాపిక ఇచ్చి ఆశీర్వదించారు. మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, బిందుమాధవ్, జయతీర్థఆచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, హరినాథాచార్ పాల్గొన్నారు.

ఇన్‌ఫోసిస్ నారాయణమూర్తి...

ఇన్‌ఫోసిస్ ఛైర్మన్ నారాయణమూర్తి శనివారం మంత్రాలయానికి వచ్చారు. మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామి నిజ బృంధావనాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈయన రాకను శ్రీమఠం అధికారులు గోప్యంగా ఉంచారు. శ్రీమఠంలో సాధారణ భక్తుల మాదిరిగానే ప్రదక్షిణలు చేశారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 14: వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహేబ్ డిమాండ్ చేశారు. శనివారం కర్నూలులో రైతు సంఘం కార్యదర్శి పంపన్నగౌడ్‌తో కలిసి రాజాసాహేబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ, ఆలూరు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులను జరిగిన నష్టాన్ని అంచనా వేసి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు సురేంద్ర, మల్లికార్జున, రమేష్ పాల్గొన్నారు.

దళితులపై దాడులను సహించం



ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయం వద్ద నాయకుల నిరసన

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 14: దళితులపై దాడులను సహించమని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గూండాల ఈశ్వరయ్య, రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య, బండారి అనుమంతు, ఆనంద్ చైతన్య, జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్ హెచ్చరించారు. శనివారం మాధితురాలని ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. దాడి చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్త ఆందోళనలు చేస్తామని అన్నారు. మహదేవ్, ప్రభాకర్, దేవన్న, పౌలు, రాము, దేవేంద్ర, దుర్గప్ప, నాగరాజు పాల్గొన్నారు.

కౌతాళం: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడిచినా నేటికీ దళితులపై దాడులు చేస్తూనే ఉన్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్, ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జగదీష్, రేవన్న, గాబ్రియేల్, రాముడు ఉన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముత్తు పెద్దకడుబూరు మండల అధ్యక్షులు మంచోది ఆదాము రవికూమార్, బుజ్జప్ప, పృథ్వీరాజ్ కళ్యాణం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 14: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆయన పరామర్శించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, భాస్కర్ యాదవ్, తిమ్మగురుడు, శ్రీనివాసులు, మాలిక్, రాజీవ్, రాజు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: దళిత మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట కమిటీ నాయకులు గురుదాస్ డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ నాయకులు రంగన్న, రామాంజనేయులు, రాజప్ప, కారన్న పాల్గొన్నారు.

వెల్దుర్తి: నిందితులను తక్షణమే అరెస్టుచేసి రిమాండ్‌కు పంపాలన్నారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహారదీక్షలకు పూనుకుంటామని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు నవీన్ మాదిగ హెచ్చరించారు. రాముడు, ఎల్లకృష్ణ, చిన్న అయ్యన్న, పుల్లన్న, పెద్దరంగడు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: దళిత మహిళను కొట్టిన వారిని పోలీసు అధికారులు కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, డిమాండ్ చేశారు. దస్తగిరి, భక్తకన్నప్ప, రంగన్న, రంగస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: దళిత మహిళ గోవిందమ్మపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు యువరాజు, అర్లప్ప, ముక్కరన్న అన్నారు. కలెక్టర్, ఎస్పీ పెద్దకడబూరు గ్రామాన్ని సందర్శించాలని డిమాండ్ చేశారు. సతీష్, శాంతిరాజు, రోగన్న, బాబు పాల్గొన్నారు.

ఆలూరు, సెప్టెంబరు 14: దళిత మహిళ గోవిందమ్మపై దాడిచసిన వారిపై అట్రాసిటీ కేసి నమోదు చేసి శిక్షించాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆలూరు తాలూకా అధ్యక్షుడు శాసం రామాంజినేయులు డిమాండ్ చేశారు.

సీనియర్ న్యాయవాది మృతి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 14: పట్టణంలో సీనియర్ న్యాయవాది హనుమంతప్ప(82) శనివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో మంచాన పడ్డారు. 1989 నుంచి ఎమ్మిగనూరు కోర్టులో న్యాయవాదిగా పని చేశారు. భార్య ఉమాదేవి, ఇద్దరు కూమారులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

మద్దికెర, సెప్టెంబరు 14:

ఎం.అగ్రహారం గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని టీడీపీ జిల్లా కార్యదర్శి మాజీ జడ్పీటీసీ జమేదార్ రాజన్న యాదవ్, మాజీ ఎంపీపీ జమేదార్ నీలకంఠ రాయుడు అన్నారు. శనివారం నిర్వాహకులకు జమేదార్ బ్రదర్స్ రూ.1,11,116 విరాళం ఇచ్చారు. కుటుంబ సభ్యులు మల్లేశ్వరమ్మ, ధనలక్ష్మి, జమేదార్ రాజావర్దన్ రాయుడు, హర్షవర్ధన్ రాయుడు పాల్గొన్నారు.

దరఖాస్తులకు నేడు ఆఖరు

ఆలూరు, సెప్టెంబరు 14: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల దరఖాస్తులకు ఆదివారం చివరి తేదీ అని ప్రిన్సిపాల్ డా. జ్ఞానేశ్వర్‌రావ్ శనివారం తెలిపారు. ఇప్పటికే రెండు దఫాలు కౌన్సెలింగ్ పూర్తి అయిందని తెలిపారు. బీఏ హిస్టరీ మేనేజర్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ జువాలాజీ గ్రూప్‌లు ఉన్నాయన్నారు.

ఆదోని వాసికి సేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న శ్రీనాథ్

ఆదోని టౌన్, సెప్టెంబరు 14: సామాజిక కార్యకర్త వంకదారు శ్రీనాథ్ గుప్తకు శనివారం బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ భారత సేవా రత్న అవార్డును అందజేసింది. ఇండియన్ రిపబ్లిక్ పార్టీ జాతీయ కార్యదర్శి నాగేశ్వర రావు, కర్ణాటక రాష్ట్ర ఆరోగ్య శాఖ కో ఆర్డినేటర్ రవికాంత్ శనివారం ఈ అవార్డును అందజేశారు. సామాజిక బాధ్యత మరింత పెరిగిందని శ్రీనాథ్ గుప్తా తెలిపారు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 14: వాల్మీకులను ఎస్టీలో చేర్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ అన్నారు. ఈనెల 22న కర్నూలులో నిర్వహించనున్న వర్క్‌షాప్‌పై ఆలూరులో శనివారం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూర్ జయరాంకు వినతిపత్రం అందజేశారు. వీరేశ్, రాజు, వీరేశ్ పాల్గొన్నారు.

మైదానంలో కంపచెట్ల తొలగింపు

తుగ్గలి, సెప్టెంబరు 14: జొన్నగిరి జడ్పీహెచ్ఎస్‌లో విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవికుమార్ పాఠశాల మైదానంలోని కంపచెట్లను జేసీబీతో శుభ్రం చేయించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని జియో మైసూరు కంపెనీ వారు కూడా సహకరిస్తున్నారని అన్నారు. హెచ్ఎం ఉపేంద్ర, వార్డెన్ రమేష్, టీడీపీ నాయకులు బాలన్న, లక్ష్మన స్వామి ఉన్నారు.

రెండు రోజులు పూజలు బంద్

మంత్రాలయం, సెప్టెంబరు 14: శ్రీమఠంలో శని, ఆదివారాల్లో ఏకాదశి రెండు రోజులు రావడంతో పూజలు బంద్ చేశారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూల రాములకు పూజలు చేసి బృందావనానికి జరిగే నిత్య పూజలకు విరామం కల్పించారు. ఏకాదశి శని, ఆదివారం రెండు రోజులు ఏకాదశి ఉండటంతో రథోత్సవాలు, టెంకాయలు కొట్టడం, పరిమళ ప్రసాదం, నిత్యాన్నదానం, బృంధావ నానికి విశేష అలంకరణ రద్దు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

గోనెగండ్ల, సెప్టెంబరు 14: అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సీఐ గంగాధర్ హెచ్చరించారు. శనివారం మాట్లాడుతూ హెచ్.కైరవాడి, గంజహళ్లి, పుట్టపాశం, వేముగోడు, తిప్పనూరు హంద్రీ నది పరిసరప్రాంతాలపై ప్రత్యేకనిఘా ఏర్పాటు చేశామన్నారు. మట్కా, పేకాట, అక్రమ మద్యంపై సమాచారమివ్వాలని, సమా చారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

దాహార్తి తీర్చడానికి బోరు: టీడీపీ


బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, సెప్టెంబరు 14: మండలంలోని మాచాపురంలో విద్యార్థుల దాహార్తి తీర్చడానికి తాగునీటి బోరు వేయిస్తున్నట్లు మాజీ సర్పంచ్ కాశీంవలి, విద్యాకమిటీ మాజీ ఛైర్మన్ పీరసాబ్ తెలిపారు. ఎమ్మెల్యే బీవీ ఆదేశాల మేరకు శనివారం బోరు వేయించినట్లు వారు తెలిపారు. వలీ, అనుమంతు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 14: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంజన్న మాట్లాడుతూ జాతీయ భాషగా హిందీని కేంద్ర ప్రభుత్వం 1949 సెప్టెంబరు 14 గుర్తించిందన్నారు. జాతీయ స్థాయిలో ఉద్యోగాలు పొందేందుకు హిందీ ఎంతో కీలకమన్నారు. ఇంటర్‌లో 99 మార్కులు సాధించిన వారికి బహుమతులను అందజేశారు. అధ్యాపకులు గోవిందరాజు, వేదవతి, చిట్టి ప్రసాద్ శ్రీనివాసులు రాజేశ్వరి కాంతమ్మ ప్రభావతి బాబు సూరిబాబు పాల్గొన్నారు.

కౌతాళం: ప్రతిభ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయురాలు ముంతాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కరస్పాండెంట్ దూద్‌బాషా, హెచ్ఎం జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవా పురస్కారం

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 14: పట్టణానికి చెందిన శ్రీనివాసులకు సోమలరాజు అంతర్జాతీయ సొసైటీ సామాజిక సేవలో భాగంగా డాక్టర్ అంబేద్కర్ జాతీయ సేవా పురస్కారాన్ని అందజేసింది. ఈ అవార్డు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కౌతాళం, సెప్టెంబరు 14: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు కౌతాళం ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ బంటకుంట వంక నుంచి గోతుల దొడ్డి గ్రామానికి చెందిన దిబ్బయ్య గారి పరమేశ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని నిదితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీఈటీల సమస్యలు పరిష్కరించాలి

తుగ్గలి, సెప్టెంబరు 14: జిల్లాలో పీఈటీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఏపీ పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్ కోరారు. శనివారం కర్నూలులో ఎంపీ బస్తిపాటి నాగరాజుకు విన్నవించామన్నారు. జిల్లాలో క్రీడా మైదానాలు లేక ఇబ్బంది పడుతున్నామని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తే విద్యార్థులు క్రీడల్లో రాణిస్తారని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

హొళగుంద, సెప్టెంబరు 14: కార్యకర్తలకు అండగా ఉంటానని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి శనివారం అన్నారు. హొళగుంద తెరుబజార్‌లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ నెరవేర్చలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి మూడు నెలలు కావస్తున్న సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదని అన్నారు. బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, కృష్ణ మోహన్, కొగిలాతోట శేషప్ప, ఎస్కే గిరి, దర్గప్ప పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి

హొళగుందలోని రాజా నగర్‌లో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే విరూపాక్షికి వినతిపత్రం అందించినట్లు ఎస్ఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరంగ, కాకి గాదిలింగ శనివారం తెలిపారు.

ఏచూరి ఆశయాల కోసం కృషి చేయాలి


వెల్దుర్తిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

మంత్రాలయం, సెప్టెంబరు 14: సీతారాం ఏచూరి ఆశయాల కోసం కృషి చేయాలని సీపీఎం కార్యదర్శి జయరాజు, అనిల్ అన్నారు. శనివారం ప్రైవేటు అతిథి గృహంలో నివాళి అలర్పించారు. సీతారాం ఏచూరి సేవలను గుర్తించి ఆయన ఆశయాలను ముందుకు నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఆయన లేనిలోటు కామ్రేడ్‌లకు తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మన్న, ప్రాణేష్, రాజన్న, దానియేలు, వీరేష్, కరుణమ్మ, పాల్గొన్నారు.

వెల్దుర్తి: స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) కార్యాలయంలో శనివారం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు రాజు, మారెన్న, డీవైఎఫ్ఐ నాయకుడు నగేష్, మల్లి, సత్యం, చిన్నయేసు, బ్రహ్మం, కిట్టు, రాముడు, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మేలుకున్నారు

- బనవాసి భూముల ఆక్రమణలపై గ్రామాల్లో దండోరా
- ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు


పశుసంవర్ధక శాఖ భూమిలో పంటల సాగు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 14: వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు ఎట్టకేలకు మేలుకున్నారు. బనవాసి అటవీ క్షేత్రంలో అన్యాక్రాంతమైన భూములను కాపాడుకోవడానికి నడుం బిగించారు. మండలంలోని బనవాసి అటవీ క్షేత్రంలో దాదాపు 3వేల ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. కాగా కేవీకే, నవోదయ, ఏఈపీ గురుకుల పాఠశాల, గురుకుల జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ తదితర సంస్థలకు కొన్ని ఎకరాలు కేటాయించారు. కాగా ప్రస్తుతం 1,500 నుంచి 2వేల ఎకరాల వరకు పశుసంవర్ధక శాఖ ఆధీనంలో ఉంది.

ప్రభుత్వ భూముల ఆక్రమణ

గత ప్రభుత్వ హయాంలో అటవీ భూముల ఆక్రమణ మొదలైంది. తమ పొలాలకు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కలిపేసుకున్నారు. భూములు సాగు చేసుకోవడమే కాకుండా కౌలుకు కూడా ఇచ్చినట్లు తెలుస్తుంది.

ఖాళీ చేయాలని గ్రామాల్లో దండోరా

ఎట్టకేలకు ఈ ఆక్రమణలపై స్పందించిన ఘనీకృత వీర్య ఆంబోతు కేంద్రం అధికారులు శుక్రవారం రాత్రి గ్రామాల్లో దండరో వేయించారు. వెంటనే ప్రభుత్వ భూములను ఖాళీ చేయాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి.